# కంద మకరందం

## (శతకం)



సాగర్ల సత్తయ్య

# కంద మకరందం

( శతకం )

సాగర్ల సత్తయ్య

ప్రమోద సాహితి
చిట్యాల,నల్లగొండ జిల్లా 508114

# కంద మకరందం
(శతకం)

ప్రథమ ముద్రణ : జూన్ 2016

ప్రతులు : 1000

వెల : 30=00

ప్రచురణ : ప్రమోద సాహితి
చిట్యాల

ప్రతులకు : సాగర్ల ధనలక్ష్మి
వట్టిమర్తి,చిట్యాల
నల్లగొండ-508254.
9966549991

C@ రచయితవి

ముద్రణ:
శ్రీ అనూ పబ్లికేషన్స్
గాంధీనగర్
విజయవాడ.
9490750137

# అంకితం

నాకు జన్మనిచి, ఎన్నో కష్టాలకోర్చి నన్ను చదివించి ఇంతటివాణ్ణి చేసిన నా తల్లిదండ్రులు **శ్రీసాగర్ల ధర్మయ్య-పార్వతమ్మ** గార్ల పాదపద్మాలకు..

**అభినవపోతన, అక్షర కళాసమ్రాట్,**
**కవిభూషణ,కవితాశ్రీ**
**మధురకవి డా॥ కూరెళ్ళ విఠలాచార్య**
**ఆచార్య కూరెళ్ళ గ్రంథాలయం**
**సాయిసాహితీ కుటీరం, వెల్లంకి**
**రామన్నపేట(మం) నల్లగొండ (జిల్లా)**
**సెల్: 9949539765**



# ఆశీరభినందన

తెలుగు భాషకు ' పసుపురాసిన తాళపత్ర గ్రంథమ్ముపై శ్రీకారమేనాడొ చెక్కినారో' కానీ ఆంగ్లభాషా ప్రభావం ఎంతపడినా తెలుగు భాష తన ప్రాశస్త్యాన్ని నిలుపుకుంటూ వివిధ సాహిత్య ప్రక్రియలలో ఎనలేని అభ్యుదయ పథంలో పయనిస్తూనే ఉన్నది. తెలుగు భాషలో అన్ని ప్రక్రియలలో 'శతకం' అపురూపంగా అబ్బురపడే రీతిలో ముందుకు వెళుతుంది. కొందరు శతక రచన ప్రాథమిక రచన అని అంటారు. కాని శతకముకటే రాసిన కాళహస్తీశ్వర శతకకర్త ధూర్జటి, ఆంధ్రనాయక శతక కర్త కాసుల పురుషోత్తం, మహానుభావులు, మహాకవులయ్యారు. శతకం సమాజ సంస్కారానికి, ఆత్మ సంస్కారానికి దోహదపడుతుంది. లోక స్థితిగతులను, ఎత్తిచూపడానికి శతకం ఓ శక్తివంతమైన ఆయుధం. సాధారణంగా 108 పద్యాలతో శతకం చెబుతారు. వేదాలలో పురాణాలలో, ఇతిహాసాలలో 108 సంఖ్యను చాలా పవిత్రంగా భావించారు. శతకం ఆబాలగోపాలాన్ని ఆకట్టునే ప్రక్రియ . నేటి వరకు వివిధ ఛందస్సులలో వివిధ అంశాల మీద తెలుగు భాషలో వేల శతకాలు రావడం విశేషం. సుమతి వేమన శతకాలు సంస్కృతంలనికి, ఆంగ్లంలోనికి అనువదించబడ్డాయంటే ప్రపంచ సాహిత్యంలో తెలుగు శతకం ఎంత ప్రాచుర్యం పొందిందో అర్థమవుతుంది.

ఎవరి అభిప్రాయాలు ఎలా ఉన్నా శతకం ప్రక్రియకు మూలస్థానం తెలంగాణమే. తొలి తెలుగు శతకం సాహిత్య, సంస్కార విప్లవ మూర్తి పాల్కురికి సోమనాథుడు రాసిన వృషాధిప శతకమే. తెలంగాణా తెలుగు శతకానికి ప్రత్యేకమైన స్థానమే కాకుండా ప్రతిష్టాకరమైన స్థానాన్ని సంపాదించి పెట్టింది.

ఇలా ప్రఖ్యాతమైన శతక ప్రక్రియను చేపట్టి ఆత్మీయుడు, ప్రియమైన చిరంజీవి సాగర్ల సత్తయ్య ' కందమకరందం' పేరుతో పది అంశాలతో కూడిన ఓ వినూత్నమైన శతకాన్ని రాసాడు. ఇందులో వర్తమాన సమాజంలో కొట్టొచ్చినట్టు కనిపించే అనేకాంశాలను పది విభాగాలుగా వింగడించి ఒక్కొక్క అంశంమీద పది పద్యాలు రాస్తూ పఠిత్రులోకానికి

కళ్ళకు కట్టి చూపించాడు. సాగర్ల సత్తయ్య శతకానికుండవలసిన సంఖ్య, మకుట, ఛందో నియమాలను అక్షరాలా పాటిస్తూ ఆయన కిష్టమైన కందాన్ని శతకానికి ఎన్నుకున్నాడు. సాగర్ల సత్తయ్యను ఓ చిరంజీవిగా నేనెంతో ప్రేమిస్తాను. ఆయనను నామనసారా సా.స(సాగర్ల సత్తయ్య)అని పిలుచుకుంటాను. నిజంగా ఆయన శ్వాసే సాహిత్యం. అందులో పద్యమంటే చాలా ఇష్టం. అన్ని ఛందస్సులలో సత్తయ్య అందమైన పద్యాలెన్నో రాసాడు. ఆయన పద్యాలలో భాష సరళం. భావం సందేశాత్మకం. ఈ రెండు ప్రధానంగాఈ శతకంలో కనిపిస్తాయి. సాగర్ల ధారాశుద్ధి కలిగిన కవియే కాకుండా చిత్తశుద్ధి కలిగిన ఉత్తముడు. ఆయన కవితా రచనలో ఆయనకున్న సృజనాత్మక శక్తి కనిపిస్తుంది. ఉపాధ్యాయుడుగా అధ్యాపనం పట్ల ఆయనకున్న అంకితభావం సాక్షాత్కరిస్తుంది. సామాజిక స్పృహ నిండుగా కలిగిన వాడు మా సాగర్ల. ఆయనకు సాహిత్య, సాంస్కృతిక విద్య, ఆధ్యా త్మిక, సంస్థలతో ఎంతో సాన్నిహిత్య ఉంది. అన్నిటికన్నా మించి సా.స. అసలైన సహృదతా మూర్తి.

ప్రస్తుత కృతి 'కందమకరందం'లొ ఉన్నవన్నీ హృద్యమైన పద్యాలే. మచ్చునకో పద్యం ఉదహరిస్తాను.

పుట్టెడి శిశువును స్త్రీయని
పొట్టలొ హతమార్చుచుండె పుట్టక మునుపే
యిట్టి పనిని ఆపనియెడ
యెట్టుల కొనసాగు సృష్టి యిలలో నరుడా!

ఈ పద్యంలో ప్రస్తుత సమాజంలో కనిపించే వికృత చేష్టలను వివరిస్తూ లోకాన్ని హెచ్చరించాడు. ఈ విధంగా అన్ని పద్యాలలో అనేక సమస్యలను చిత్రీకరిస్తూ పరిష్కారం కోసం తపించాడు. కందం కవి ప్రతిభకు ప్రతీక. సాగర్ల కందాలలో అభివ్యక్తి ఆలోచనాత్మకం. శైలి సుందరంగా, సులభంగా ఉంటుంది. ఇంతటి ఉత్తమ కృతి రాసిన మా చిరంజీవి సాగర్ల ను నా మనసారా అభినందిస్తూ ఆశీర్వదిస్తున్నాను. ఆయన కలం నుండి ఉత్తరోత్తర ఎన్నో ఉత్తమ కృతులు రావాలని కోరుకుంటున్నాను. ఆయనకు ఈ రచనా రంగంలో ఎల్లవేళలా సహకరిస్తున్న ఆయన ధర్మపత్ని శ్రీమతి ధనలక్ష్మి ఎంతో అభినందనీయురాలు. వారి చిరంజీవులు శ్రీనందన్, శ్రీవర్ధన్‌లకు నా ఆశీస్సులు. నా ఇష్టదైవం షిరిడీ సాయిబాబా అనుగ్రహించుగాక!

శుభాభినందనలతో...

డా॥ కూరెళ్ళ విఠలాచార్య

24.05.2016

**అభినవ దాశరథి, శ్రీ దోరవేటి**
**ప్రముఖ కవి, రచయిత**
**ప్లాట్ నెం.101, శ్రీలక్ష్మీభార్గవి నిలయం**
**ఇంటినెం. 1-4-938/2/ఎ, బాకారం, ముషీరాబాద్,**
**హైదరాబాద్-20, సెల్: 9866251679**



## జయోస్తు తమ్ముడా!

సాగర్లవంశ తిలకా!
మ్రోగెను నీ హృదయగీతి మోదము గలుగన్
సాగించుమిట్లె రచనను
యోగమ్మిది పద్యవిద్య యురుగుణ  జలధీ!

కందము ఛందమందు శతకంబును వ్రాసి మహాకవీంద్ర స
ద్బృందములోన జేరితివి ప్రేమపురాశివి తమ్ముడా! పఠిం
పందగు శైలి, భావనలు భవ్యము, భాష సంబోధకంబు, హృ
న్విందగు యోచనా సరళి నిన్ను నొనర్చెను ధన్యమూర్తిగా!

వినయము భాషణంబుగను విజ్ఞతతోడ మెలంగు తమ్ముడా !
అనయము మంచిపెంచగ సమార్ద్రత మీరగ జేయు యోచనల్
నిను సుకవీంద్రుజేసె : గణనీయపు సత్కృతినిచ్చె: మెచ్చు నీ
జనతయు నీ కవిత్వము నిజమ్మిది భావి మహాకవీంద్రుడా!

సమకాలీన సమస్యలన్  తడిమి సౌజన్యంబు నిండార, సం
భ్రమమౌ రీతిని ఛందమందు పొదిగే ప్రావీణ్యతన్ నేర్చి, నీ
మములన్ దాటక గూర్చినావు కవితా మాన్యత్వమింపొంద, వి
క్రమమున్ జూపుము ముందుముందు మురియంగా సాహితీలోకముల్!

మేలును గూర్చు కవిత లవ
లీలగ వ్రాసిన విధమ్ములే నిను కవితా
లోలుని జేసె జయోస్తు! వ
రాలను గురింపించు వాణి ! రమ్య కవీంద్రా !

**ఆశీసులతో...**
**దోరవేటి**

**డా॥ ఏనుగు నరసింహారెడ్డి,**
**కవి, రచయిత**
**స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ బాలానగర్**
**ఇంటినెం. 3-14-50, విజయశ్రీకాలనీ, సహారా రోడ్డు**
**వనస్థలిపురం, హైదరాబాద్-70**
**సెల్: 8978869183**



## మళ్ళీ శతకమే ఎందుకంటే

కవిత్వం అన్నకు వదిలేసిన మహా రచయిత దాశరథి రంగాచార్య కూడా జనరంగ శతకం రాసాడు. మళ్ళీ శతకమే ఎందుకు అనే ప్రశ్నకు అదొక జవాబు. శతకం ఒక స్వేచ్ఛా ప్రక్రియ. ఒక్కో పద్యంలో ఒక్కో విన్యాసం చేయవచ్చున్న ఎరుక ఉన్న వాళ్ళందరూ శతకం రాస్తారు.

చేసిన భోజనమే రోజూరోజూ చేసి, చేసిన సంసారమే ప్రతి కుటుంబీకుడూ చేసినా ఎవరి రుచి, ఎవరి తాదాత్మ్యం, నవ్యత వారికి ఉంటుందన్న వాదనతనకు వర్తిస్తుందో లేదో పట్టించుకోడు కవి. ఒక సూర్యుడు సమస్తజీవులకు తా నొక్కొక్కడై తోచిట్లుగా శతాబ్దాలుగా కవుల చేత నిర్వచించబడ్డ లోకం పోతూనే ఉంది. పోతూ పోతూ కవులను కదిలించి రెచ్చగొట్టి ముందుకు సాగుతుంది. కాలవాహిని ప్రవాహాన్ని చూస్తున్న కవి దాని ధాటికిఅతలాకుతలమవుతున్న సమాజ తంత్రుల్ని వీక్షిస్తాడు. వాటి నాదాల్ని జాలితో జాగరూకతతో వింటాడు. విన్నది కళతో మేళవించి అక్షరబద్ధం చేస్తాడు. ఆ అక్షరం ఒక భాషలోఅనుష్టుప్ అయింది, ఒక చోట దోహ అయింది. ఒక సారి సానెట్ అయింది. ఒక నేలమీద గజల్ అయింది, ఒక తెలుగులో పద్యమయింది. పద్యంలోఓ నిక్షిప్తమయిన హృదయం దాన్ని రెండు వేల యేండ్లు కాపాడింది. కావ్యాలు, మహా కావ్యాలు, పురాణాల్ని పుట్టించిన పద్యం కథఅంతసూత్రంగా నడిచినట్లుగానే కథారహిత వ్యక్తీ కరణకూ పెద్దపీట వేసింది. కథా రహిత పద్య కవితానికి బీజం వేసింది. అదే ముక్తక పద్యం, శతకం పాల్కురికి సోమనాథుని నుండి సాగర్ల సత్తయ్య వరకూ లెక్కవేస్తే శతాధిక శతక తారలు తెలుగు సాహిత్యాకాశాన్ని అలంకరించాయి. అయితే వస్తు నవ్యత, అభివ్యక్తి నవ్యత ఉన్న కొద్ది శతకాలే ప్రజల నాల్కల మ ఈద అచ్చువడ్డై.

ఆలు నిర్వాహకురాలు భూదేవి యై
యఖిల భారకుడన్న నాఖ్యదెచ్చె

ఇష్టసంపన్ను రాలిందిర భార్య యై

కామి తార్థుడన్న గనత దెచ్చె

కమల గర్భుడు సృష్టికర్త తానూజుడై

బహుకుటుంబికుడన్న బలిమి దెచ్చె

కలుష విధ్వంసిని గంగ కుమారి యై

పతిత పావనుడన్న ప్రతిభ దెచ్చె

ఆలుబిడ్డలు దెచ్చు ప్రఖ్యాతి యే గాని

మొదటినుండియు నీవు దామోదరుడవె

చిత్రచిత్ర ప్రభావ దాక్షిణ్య భావ

హత విమత జీవ శ్రీకాకుళాంధ్రదేవ

**(కాసుల పురుషోత్తమ కవి)**

సోమన, వేమన, బద్దెన గోపనలు తెలుగ ఉ వారింటి ఆత్మబంధువులైనారంటే అందుకు కారణం  వారి సృజనలోని నవ్యత,  భాషలోని ధారాళత అలాంటి కవుల శతకాలు చిరకాలం నిలబడతాయి.

ఇప్పటి శతక కర్తలకు సామాజిక బాధ్యత మెండు.  పూర్వ కవులు దైవారాదన చేస్తే  ఆధునికులు ప్రజారాధన చేస్తారు. మాధవపూ అంటే మానవ సేవే కదా! ఈ నిజం సాగర్ల సత్తయ్యకు తెలుసు. అందుకే ఆయన అన్నదాతల జీవన యాతలకు కరిగిపోయిండు. స్త్రీల దైన్యం పట్ల చింత చేసిండు. వీటిని రైతు వాదం స్త్రీ వాదం అనవచ్చు. అక్కడితో ఆగిపోయే హృదయం మాత్రమే ఉన్న కవి కాదు సాగర్ల సత్తయ్య. సమాజంలోని సమస్త అస్తవ్యస్థతల మీద, రుగ్మతల మీద తనదైనఅవగాహన, కార్యాచరణ ఉన్నవాడు. ఓటువిలువ, పర్యావరణ రక్షణ బాధ్యత ఈయనకు బాగాతెలుసు. విద్య కున్న శక్తి, కవిత్వానికున్న మహత్తు. బుద్ధిజీవులకున్న సామర్థ్యం పట్ల ఆయనకు గొప్ప నమ్మకం. అందుకే 'చదువుల కిల వేరే సిరి సాటిరాదు' అని స్పష్టం చేస్తాడు. 'చదువులు చక్కగ జదివిన పదముల వద్దకు కొలువులు పరుగున వచ్చు' నంటాడు. గ్రంథాలను మాత్రమే కాకుండా లోక రీతిని చదువుమని నవ్య కవిత్వం చెబుతాడు.

రైతుల పట్ల, మహిళల పట్ల కవికున్న పక్షపాతం   వల్ల ఆయన మీద మనకున్న గౌరవం ఇనుమడిస్తుంది.

'పుట్టెడు అప్పులు తరుమగ
పుట్టెను గద అన్నదాత పట్నము దారిన్
మట్టిని నమ్మిన రైతుకు
పట్టిన దుర్గతి వలసల బాటలు నరుడా!'
తన వస్తులుండి సైతము
తనపుత్రుల కుడుపునింపు తల్లుల కంటెన్
ఘనమైన దైవమెవ్వరు ?
ఎనలేనిది తల్లిప్రేమ యిలలో నరుడా!

'మట్టిపాట' శతకంలో నేను రాసిన

'అప్పులోల్లు పైసలడిగితే ఎట్లంచు
పొట్టకూటి గింజ లెట్టులనుచు
వెరచి రైతు బిడ్డ ఉరికొయ్యకూగెరా!
పల్లె బతుకు మాది పాడుగాను '

భావానికి అతి దగ్గరగా వచ్చిన కవిమిత్రుడు సాగర్ల సత్తయ్య గారిని మనసారా అభినందిస్తున్నాను.

భావంలో స్పష్టత, భాషలో ధారాళతతో సాగర్ల సత్తయ్య పద్యం పాఠకులను ఆసాంతం చదివిస్తుంది. డా॥ కూరెళ్ళ విఠలాచార్య, సూరోజు బాలనరసింహచారి లాంటిపద్య దిగ్గజాల  వారసుడు కాగలడని భరోసా కలుగుతుంది.

**–డా॥ ఏనుగు నరసింహారెడ్డి**

**8978869183**

**డా॥ తండు కృష్ణ కౌండిన్య**
M.A; NET; M.Phil; Ph.D
**అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ,**
**యం.కె.ఆర్.ప్రభుత్వ డిగ్రీ కళాశాల,**
**దేవరకొండ, నల్లగొండ జిల్లా**
**సెల్: 9704731346**



# అందాల కందాలు

'అపారే కావ్య సంసారే కవిరేవ ప్రజాపతి:' అని ఆనందవర్ధనుడు, 'ఇంద్రపదవి కన్న కవీంద్రపదవి మిన్న' అని ఎల్లోరా కవి గొప్పతనాన్ని తెలియజేశారు. ఆ కవి మొదటి మనిషి, సమాజంలో అతడు ఒక భాగం. ఆ తర్వాతే కవితాస్పందన కలిగిన విశిష్టవ్యక్తి. కవి మనిషిగా సమాజంలో ఒకడు కాబట్టి సమాజంలో కనిపించే అన్యాయాలకు, అసమానతలకు, అక్రమాలకు, దౌర్జన్యాలకు స్పందిస్తాడు. ఆ స్పందనలను ప్రకటించే రచనాశక్తినిసాధించడం వల్ల వాటిని లోకానికి నివేదించి ప్రజల్లో మార్పు తీసుకురావడానికి ప్రయత్నం చేస్తాడు. సరిగ్గా అలాంటి ప్రయత్నమే మిత్రుడు సాగర్ల సత్తయ్య చేస్తున్నారు. ఆ ప్రయత్నానికి ప్రతిరూపమే ఈ కంద పద్యాల శతకం.

తెలుగు సాహిత్యంలో ఒక విశిష్టమైన స్థానం సంపాదించుకున్న సాహిత్య ప్రక్రియ శతకం. ఇది మల్లికార్జున మండితుని శివతత్వ సారంగా ప్రారంభమై, వృషాధిపశతకంగా విస్తరించి, సుమతీ శతకంగా విశాలమై, దాశరథీ శతకంగా దేదీప్యమానమై తెలుగు సాహితీక్షేత్రాన్ని సుసంపన్నం చేసింది. శతకం ద్వారా సమాజంలో మానవీయ విలువలను పెంపొందించవచ్చు. సంఖ్య, మకుట, ఛందో నియమాలు శతకానికి ప్రధాన లక్షణాలు. సాధారణంగా శతకంలో 108 పద్యాలు ఉంటాయి. ఆట వెలదులో, తేటగీతుల్లో, సీసాల్లో, వృత్తాల్లో కంద పద్యాల్లో శతకాలు పుష్కలంగా వచ్చాయి. ప్రాచీన కవుల నుండి ఆధునిక కవుల వరకు ప్రతి ఒక్కరూ దాదాపుగ శతక ప్రక్రియను స్పృశించినవారే. సాధారణంగా కవులు శతక ప్రక్రియతో తమ రచనలకు శ్రీకారంగావించి ఆ తరువాత కావ్యాలను రాయడం జరిగింది. ఈ శతకాల్లో ప్రధానంగా భక్తి, శృంగార, వైరాగ్య, అధిక్షేపాత్మక, నీతి సంబంధమైనవి ఎక్కువగా ఉన్నాయి. సమాజం వక్రగతిన పయనిస్తున్నప్పుడు, నీతి నియమాలు అడుగంటిపోతున్నప్పుడు పతనమైపోతున్న మానవీయ విలువల్ని ప్రతి మనిషి హృదయంలో పాదుగొల్పడానికి శతక కవులు ప్రయత్నం చేశారు. సరిగ్గా అదే కోవకు చెందినదీ శతకం.

'నరుడా' అను ఏకపద మకుటంతో కంద పద్యాల్లో రాయబడిన శతకమిది. అసలు శతక సాహిత్యమే కంద పద్యాలతో ప్రారంభమైంది కదా! కందం రాసినవాడే కవి అనునానుడివల్ల కంద పద్యం రాసి కవిననిపించుకోవాలన్న తపన ప్రతి కవిలో ఉ

ంటుంది. అలాంటి తపనతోనే సాగర్ల సత్తయ్య కందం ఛందస్సులో ఈ శతకాన్ని రాశారు కాబోలు. సహజమైన శైలిలో, సరళమైన పద్యాలతో అందరికీ అర్థమయ్యే విధంగా ద్రాక్షాపాకంలో కందాల అందాల్ని ఆవిష్కరింప చేశారు. తెలుగు భాషోపాధ్యాయుడైన సత్తయ్య వృత్తి పట్ల అంకితభావం కలవారు. తనదైన బోదనాపటిమతో విద్యార్థులను తీర్చిదిద్దుతూ వారి ఆదరాభిమానాలను చూరగొంటున్న ఆదర్శ ఉపాధ్యాయుడు. తరగతి గదిలో మార్పు తీసుకువస్తే సమాజంలో మార్పు తీసుకువచ్చినట్లు అనుభావన కలవారు. ఆ భావనతోనే ఈశతకాన్ని రాసి మనముందుకు తీసుకొని వచ్చారు. ఇష్టదేవతాస్తుతితో ప్రారంభమైన ఈ శతకంలో అన్నదాత, మద్యపానం, సబల, ఓటు, చెట్టు, నీరు, అమ్మభాష, సన్నప్రాణులు-సందేశాలు, చదువు, పద్యం అను అంశాలను గూర్చి రాయబడిన పద్యాలున్నాయి. ఒక్కో అంశం పది పద్యాల్లో రాయబడడం ఈ శతకంలోని ప్రత్యేకత. ఇష్టదేవతాస్తుతి, పద్యం అను అంశాలు తప్ప మిగిలిన ప్రతి అంశంలో పదేసి చొప్పున పద్యాలున్నాయి.

కంద పద్యం రాయడం ఒక ఎత్తైతే దాన్ని అందంగా రాసి మెప్పించడం మరొక ఎత్తు. అలాంటి కంద పద్యాల్ని తడబాటు లేకుండా చక్కని కవితాధారతో సరళంగా, సుబోధకరంగా, హృదయానికి హత్తుకొనిపోయేవిధంగా రాయడం జరిగింది. అన్నదాత గురించి తెలియజేస్తూ, అన్నం పెట్టే రైతుకు ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలవాలని అలా నిలబడకపోతే రైతుల ఆత్మహత్యలు ఆగవని తెలియజేశారు. అంతేగాకుండా దేవతలకు కూడా కూడు పెట్టె రైతన్నకు సమాజంలో ఏమాత్రం విలువ లేదు అనుభావనను ఈ విధంగా చెప్పారు.

కం. కోవెలలో కొలువుండిన । దేవతలకు కూడుబెట్టు దేవుడుగాదే?

దైవసముడైన రైతుకు । ఈవసుధలో విలువలేదు యేలనొ నరుడా!

(అన్నదాత-పద్య సంఖ్య 10)

అదేవిధంగా మద్యపానం వల్ల కలిగే దుష్ఫలితాలను తెలియజేస్తూ సోపతికోసం కూడా తాగవద్దని హెచ్చరించారు. స్త్రీ ప్రాధాన్యతను గూర్చి తెలియజేస్తూనే గర్భస్థ శిశు వు ఆడపిల్ల అని తెలియగానే నిర్థాక్షిణ్యంగా చంపేస్తుంటే సృష్టి ఏ విధంగా కొనసాగుతుందని ఆవేదన వెలిబుచ్చారు. ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం అని అలాంటి ఓటును అమ్ముకోవడం మంచిది కాదని, ఆ ఓటుతోనే మంచి నాయకుని ఎన్నుకోవాలని ప్రబోధిస్తూ, ఈ విధంగా చెప్పారు-

కం. ఓటే ప్రగతికి మూలము । ఓటే మన బ్రతుకుబాట ఓటే యౌరా

ఓటేయుట మన విధియగు । ఓటే దేశాభివృద్ధి ఊతము నరుడా!

(ఓటు-పద్య సంఖ్య 9)

'వృక్షోరక్షతి రక్షిత:' అన్నట్లుగా వృక్షములను కాపాడితే అవి మనల్ని కాపాడుతాయని తెలియజేస్తూ చెట్టు సకల మానవాళిని ఏ విధంగా ఉపయోగపడుతాయో సమగ్రంగా చెప్పారు. నల్లగొండ జిల్లాలో ఫ్లోరిన్ మహమ్మారి గూర్చి తెలియజేస్తూ నిత్యం ఫ్లోరిన్ నీటిని తాగే ప్రజలకు హాలాహలం మింగిన శివుడు కూడా సాటిరాడని ఫ్లోరిన్ నీటిని ఆ శివుడు కూడా తాగలేడని చెప్పడంలో ఫ్లోరిన్ ఎంత విషపూరితమైనదో తెలుస్తుంది. అదే విధంగా అమ్మ భాష గురించి, సన్నప్రాణుల సందేశాల గురించి, చదువు ప్రాధాన్యతను గూర్చి హృద్యమైన పద్యం గురించి చాలా చక్కగా చెప్పారు.

Poetry is the musical thouth (సంగీతాత్మకమైన ఆలోచనయే కవిత్వం) అని కార్లిల్ చెప్పినట్టుగా చక్కని కవితాధారతో లయాత్మకంగా భావమును ఆవిష్కరించారు. చతుర్మాత్రా గణములు కలిగి పాడుకోవడానికి వీలుగా ఉండే కందాన్ని ఒంటబట్టించుకొని ఇంత సరళ సుబోధకంగా పాఠకుల హృదయాలకు హత్తుకొనిపోయే విధంగా ఈ శతకాన్ని రచించిన మిత్రుడు సాగర్ల సత్తయ్యకు అభినందనలు తెలియజేస్తూ, వీరి కలం నుండి మరిన్ని మంచి రచనలు వెలువడాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

**డా॥ తండు కృష్ణ కౌండిన్య**

వైశాఖ శుద్ధ త్రయోదశి, గురువారం
తేది 19- 05-2016

**ఐతగోని వేంకటేశ్వర్లు**

**కవి,**

**ప్లాట్ నెం.జి1, చందమామ టవర్స్**

**రామగిరి, నల్లగొండ**



# అభినందన

1 ఏమీనైపుణి ద్రాక్ష పాకమగుచున్నెంతోప సందయ్యెడిన్
మీ మాధుర్యపు కందముల్చదువగా మేన్మర్చి తిన్యత్తయా
శ్రీమద్యామిని కోయిలమ్మ పలుకుల్ చేశారు సన్నంబుగా
సోమున్ జంద్రిక భాతిభావములతో శోభించు మీకున్ నతుల్

2 విషయసృష్టత 'నేటి జీవితపు' సవ్విజ్ఞాన సంప్రోక్షణం
బసమానంబుగ, విజ్ఞులజ్ఞులయినన్నానందమున్ దోగస
తృషినన్ జేయుచు, మేలుకొల్పి జనులన్ ధీధీప్తులంజేయుచున్
పసతో సత్తమ చెప్పినారుగద మీ వాక్చాతు మాదుర్యతన్

3 తరువుల్ చేసెడి మేలుసెప్పితిరి తత్క్షీణ తల్సెప్పితి
ర్మరికాలుష్యపు భూతమున్ దరుమగా మంత్రాలు సూచించి తి
ర్తరిమే కర్వున గల్గు నష్టముల, విస్తారంబు వర్ణించితి
ర్ధరనిద్దద్దన నేల సర్వవిషయాల్ దర్శింపసేతే భళా

4 సరళభాషన భావఫక్వత సాగిపోయెను సత్తయా
కరుణ తోడుత నన్నదాతలు, కర్షకుల్మరి, శ్రామికుల్
ధరణి మేల్కొన చెప్పినావయ ధర్మముల్ ప్రవచించుచున్
చిరయశస్విగ వెల్గుమీవిక సేసిపద్యపు నేద్యమున్

5 భారతంబున కుళ్ళు బుద్దుల పాలనంబును దూచున్
వారి కోట్లను వేయవద్దని బాగసేసి, ప్రబోధముల్
కోరినావయ ఓటరన్నను గొప్ప మార్పిక గొబ్బునన్
జేరునీప్రజ లాచరించిన శ్రీలు పొంగున దేశమున్

6 సమయమ్గంటలు సాగవే క్షణములై, సారళ్యమౌభాష క
న్న మితానందము గల్గ పామరనకున్ పాండిత్య సంపన్నుకున్
తమ పద్యంబులు లోక నోళ్ళలను సన్నాట్యాంబులున్నాడు త
థ్యము వారల్ తమ జీవితాల్గనరె సత్తన్నార్య మీ పొత్తమున్

7 కరిరాజు వరదుడు జ్ఞానంబు నొసగును
సత్కవివై నీవు జగతి వెలుగ
ఇందిరాధిపుడేను నిమ్ముగ దీవించు
ప్రజల భాషన నీవు రచన జేయ
ఫణిరాజు శయనుడే ఫక్వభావములిచ్చు
మాధుర్య పద్యాలు మహిని వెలుగ
పద్మనాభుడు తాను వరములందించును
నాశుధారలు మీకు నవని గలుగ

తే॥గీ

చాల సరళపు భాషైన సత్తు వెంతొ
గలుగు కందాలు చెప్పితే ఘనుడవయ్యా
నిరత సాహిత్య విద్యార్థి నీవు వౌతు
వెలుగు సత్తన్న మీకిత్తు వేల నతులు

**– ఐతగోని వేంకటేశ్వర్లు**

**15–05–2016**

# ప్రమోదసాహితీ ప్రస్థానమిదీ...

చిట్యాలలో సాహితీ పరిమళాలను వెదజల్లే ప్రయత్నంలో ఏనుగు నర్సింహారెడ్డి, సర్దార్ బహదూర్‌సింగ్, కాసుల ఆంజనేయులు, పొన్నం రాజయ్య, వట్టె మాధవరెడ్డి, నాటి గ్రంథపాలకులు తారక రమేశ్ మొదలగు కవులతో 1987లో ప్రమోద సాహితీ తన ప్రయాణాన్ని మొదలు పెట్టింది. మొదట సభ కందిమళ్ళ రాంరెడ్డి గారి అధ్యక్షతన నేతాజివిద్యామందిర్‌లో జరిగింది. నాటి నుండి నేటి దాకా గ్రామపెద్దల సహకారంతో విజయవంతంగా కొనసాగుతున్నది.

ప్రమోద సాహితీలో యువకవులను ప్రోతహించడానికి ఇతర ప్రాంతాలకు చెందిన లబ్ధ ప్రతిష్టులైన కవులను పిలిచి వారిచే ప్రసంగాలు ఇప్పించి గౌరవించాం. డా॥ కూరెళ్ళ విఠలాచార్య, సూరోజు బాలనరసింహాచారి, డా॥ చింతల యాదయ్య, కుకుడాల లక్ష్మణ్, వేణు సంకోజు, జూలూరి గౌరీశంకర్, ప్రొ. నన్నూరి ఉపేందర్‌రెడ్డి, సుంకిరెడ్డి నారాయణరెడ్డి, డా॥ పిల్లలమర్రి రాములు, బైరెడ్డి కృష్ణారెడ్డి, బి.రాములు, కాంచనపల్లి, లెక్కల మాల్లారెడ్డి, చొల్లేటి బాలరాజు, డా॥ బెల్లి యదయ్య, బాణాల శ్రీనివాసరావు, పగడాల నాగేందర్, డా॥ తండు కృష్ణకౌండిన్య, ఎన్ఆర్ బోధనం లాంటి ఎందరో కవులుతమ ప్రసంగాలతో ప్రమోదను చైతన్యవంతం చేసారు.

మా వేదిక నుండి డా॥ ఏనుగు నరసింహారెడ్డి 'మట్టిపాట' సూరోజు బాలనరసింహాచారి 'బాల నరసింహశతకం', యెల్లోజుపదవీ విరమణ అభినందన సంచిక 'మూడు పదాల ముచ్చట'తో పాటు 2015లో ప్రమోద కవులందరి కవితలతో ఏనుగు నరసింహారెడ్డి సంపాదకత్వంలో 'అదేకల' ఆవిష్కరించుకున్నాం.

మూడు దశాబ్దాలుగా సాగుతున్న ప్రమోద ప్రస్థానంలో మరొక ప్రయత్నమే ఈ శతకం. శతక కర్తను మనసారా అభినందిస్తూ...

**కందిమళ్ళ రాంరెడ్డి**
అధ్యక్షులు
సెల్: 9492886607

**కోమటిరెడ్డి రవీందర్‌రెడ్డి**
ప్రధాన కార్యదర్శి
సెల్:9912830601

**యెల్లోజు బ్రహ్మాచారి**
సమన్వయకర్త
సెల్: 9553553364

**ప్రమోద సాహితీ, చిట్యాల, నల్లగొండ(జిల్లా)**

# కృతజ్ఞతలు

ఇది నా తొలి కృతి. విద్యార్థులకు నేను చెప్పదలచిన విషయాలు కందములో మాత్రమే అందంగా చెప్పగలనని భావించి ఈ ఛందములో పద్యాలల్లినాను. ఈ పద్యాలు సమాజంలో ఏమాత్రం చైతన్యం తెచ్చినా నా జన్మ ధన్యం .

జన్మనిచ్చిన తల్లిదండ్రులకు..విద్య నేర్పిన గురువులకు....

తమ 'ఆశీస్సు'లతో నన్ను ముందుకు నడిపిస్తున్న గురువులు, అక్షర కళాసమ్రాట్, మధుర కవి డా॥ కూరెళ్ళ విఠలాచార్య గారికి...

నా పద్యాల్ని పరిశీలించి తగు సూచనలనందిస్తూ 'జయోస్తు తమ్ముడా!' అంటూ దీవెనలనందించిన అన్నయ్య, సంగీత సాహిత్య సమలంకృతులు, కవి, రచయిత, కథకులు, నవలాకారులు, చిత్రకారులు 'అభినవ దాశరథి' శ్రీ దోరవేటి గారికి...

పనిఒత్తిడిలో తలమునకలై ఉన్నా నాపై ప్రేమతో తమ అమూల్య సమయాన్ని వెచ్చించి అభినందనలు అందించిన 'ప్రముఖ కవి' మా చిట్యాల గర్వించదగిన ఆణిముత్యం , బాలానగర్ సబ్ కలెక్టర్ డా॥ ఏనుగు నరసింహారెడ్డి గారికి...అడిగిన వెంటనే తమ ముందుమాటతో ఆశీర్వదించిన ప్రముఖ కవి డా॥ తండు కృష్ణకౌండిన్య గారికి... నా పద్యాలను వాట్సప్‌లో చదివి స్పందించి అపురూపమైన పద్యాలతో అభినందించిన కవి మిత్రులు శ్రీ ఐతగోని వెంకటేశ్వర్లు గారికి...

సాహితీ జగత్తులో నన్ను వెన్ను తట్టి నడిపిస్తున్న సాహితీమూర్తులు ప్రముఖ కవి, విమర్శకులు శ్రీ వేణు సంకోజు, డా॥బెల్లి యాదయ్య, బోధనం నర్సిరెడ్డి, పెండెం జగదీశ్వర్, ఏబూషి నరసింహ,దాసోజు జ్ఞానేశ్వర్, పెరుమాళ్ళ ఆనంద్, పున్న అంజయ్య గారలకు..

ఈ శతకం వెలుగులోనికి రావడానికి ఆర్థిక సహకారం అందించిన సౌజన్యమూర్తి, శ్రీఅను పబ్లికేషన్స్ అధినేత శ్రీ పొన్నగంటి శివయ్య గారికి...

డి.టి.పి.కవర్‌డిజైనింగ్‌లకు ఆర్థిక సహకారం అందించడమే గాక తానే స్వయంగా పర్యవేక్షించిన సహృదయ మిత్రులు, రచయిత శ్రీ తీగల జాన్‌రెడ్డి గారికి....

పుస్తకాన్ని తమ సంస్థ ద్వారా ప్రచురించడానికి అనుమతించిన ప్రమోద సాహితీ అధ్యక్షులు శ్రీ కందిమళ్ళ రాంరెడ్డి, ప్రధానకార్యదర్శి శ్రీ కోమటిరెడ్డి రవీందర్‌రెడ్డి(కోర), సమన్వయకర్త శ్రీ యెల్లోజు బ్రహ్మచారి గారికి...

నేను విద్యార్థిగా, ప్రైవేటు ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న కాలం నుండే నాకు తగు సలహాలు సూచనలు ఇస్తూ ముందుకు నడిపిస్తున్న మా పాఠశాల ప్రధానోపాధ్యాయులు టీఎస్‌యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీ కుకుడాల గోవర్దన్ గారికి, పాఠశాల సోదం ఉపాధ్యాయు మిత్రబృందానికి...

చిట్యాల ప్రమోద సాహితీ మిత్రులు శ్రీ పాటిమోహన్‌రెడ్డి(భావతేజ), నాశబోయిన నరసింహ, సోమిరెడ్డి శంకర్‌రెడ్డి,సర్దార్ బహదూర్‌సింగ్, మందలస్వామి, అద్దెల లక్ష్మారెడ్డి, కాసుల ఆంజనేయులు, జిట్ట నగేశ్, నర్రా ప్రవీణ్‌రెడ్డి,బెల్లి సత్తయ్య,కనకటి రామకృష్ణగారలకు...

నా పద్యాలను ధారావాహికగా ముద్రించిన 'తెలంగాణ యాదవబంధు' మాసపత్రిక సంపాదకులు శ్రీ మామిడి దుర్గాప్రసాద్‌యాదవ్ గారికి...తగు సూచనలందించిన కవి, జాషువా అధ్యయన పీఠం కన్వీనర్ సమత శ్రీ వల్లాల పరంధామ్ యాదవ్ గారికి...

వాట్సప్‌లో నా పద్యాలు చదివి అభినందనలందిసంచిన శ్రీమతి ఉ ప్పల పద్మ, శ్రీమతి చకిలం కవిత, శ్రీమతి శ్రీదేవి, శ్రీ శీలం అవిలేను, గంజి దుర్గాప్రసాద్, గారికి ప్రత్యేక కృతజ్ఞతలు.

నా కష్టసుఖాలలో తోడుగా నిలుస్తున్న నా సహధర్మచారిణి శ్రీమతి ధనలక్ష్మికి,మాచిరంజీవు శ్రీనందన్, శ్రీవర్ధన్‌లకు శుభాశీస్సులు.

ఈ తొలిప్రయత్నంలో భాష, భావ, ఛందో పరమయిన దోషాలేమయినా ఉంటే విజ్ఞులు తెలియజేస్తే సవరించుకుంటానని సవినయంగా తెలియజూస్తూ.....

**బుధజనవిధేయుడు**

**సాగర్ల సత్తయ్య**

## ఇష్టదేవతాస్తుతి

1 శ్రీశైలేశా! రజత గి
రీశా! భర్గా ! త్రినేత్ర ! ఈశా ! హర మీ
యాశీర్తతి నే గోరద
ప్రాశస్త్యంబైన శతక పద్య రచనకై

2 గణనాథా! గౌరీసుత!
గణుతింతును విఘ్నములను గలుగక నీకన్
గణపతి! నా శతకముకు సు
గుణముల నందించు స్వామి కూరిమి తోడన్

3 బాసర వాసినిభారతి
వాసిగ నా పద్యములకు వాక్కుల నిమ్మా!
భాసిల్లగ నా పొత్తము
భాసురమగు కరుణ జూపు బాసర వాణీ !

4 యెరుగును కవితా రీతుల
నెరుగను ఛందో నియమము లెరుగన్ భాషన్
నిరతము నిను సేవించును
కరుణతో దీవించు మల్లికార్జున స్వామీ!

5 శరణు శరణు శరణు యనుచు
పరవశముగ నిను గొలిచెడి భక్తుడు యీ పా
మరుడి కృతిని దీవింపగ
మరువకు పెదగట్టు లింగమంతులు స్వామీ!

# అన్నదాత



1) అన్నము బెట్టెడి రైతుకు
దన్నుగ నిలబడుట ప్రభుత ధర్మము గాదే
వెన్నెముక యనెడి వాడే
ఖిన్నుడగుట దేమునకు కీడగు నరుడా!

2) పుట్టెడు అప్పులు తరుమగ
పట్టెను గద అన్నదాత పట్నము దారిన్
మట్టిని నమ్మిన రైతుకు
పట్టిన దుర్గతి వలసల బాటలు నరుడా!

3) పెట్టుబడి పెరిగిపోయెను

పుట్టెడు కష్టముతొ రైతు పొగులుచునుండెన్

పట్టెడు మెతుకులు దొరకవు

పట్టదుగద రైతు గోడు ప్రభుతకు నరుడా!

4) నిన్నటి దాకా రాజై

కన్నుల పండుగగ బ్రతికి కడకు గరీబై

అన్నము పెట్టిన చేతులె

సున్నపు తట్టలను మోసె చోద్యము నరుడా!

5) సరుకుల ధరలను విపణిన్

విరివిగ వర్తకులు బెంచి విత్తమునొందన్

నిరతము చెమటోడ్చినయీ

ధరలో ధర లేని సరుకు ధాన్యమె నరుడా!

6) జోడెడ్ల బండి బాయెను

కాడెద్దుల సంతనమ్మ గరిసెలు బాయెన్

పాడుబడిన పొలములతో

యీడేరునె రైతు బ్రతుకు? యిలలో నరుడా!

7) ఋణ బాధల ముక్తికొరకు

ఫణముగ నీ ప్రాణములనె బలిపెట్టెదవ?

క్షణమాలోచించుము విర

మణ జేయుము ఆత్మహత్య మరువక నరుడా!

8) పత్తిని నమ్మిన రైతుకు

మిత్తికి దెచ్చిన ఋణములె మిక్కుటమాయెన్

విత్తనములు మొలకెత్తక

కుత్తుక కురితాడు దగిలె గోసతొ నరుడా!

9) రైతులు సమ్మెలు చేసిన

నేతలు లాయర్లు ఇంజనీరులకైన్

మేతకు కరువొచ్చి పడును

జాతిని పోషించు రైతు జవమది నరుడా!

10) కోవెలలో కొలువుండిన
దేవతలకు కూడు బెట్టు దేవుడు గాదె!

దైవ సముడయిన రైతుకు

యీ వసుధలొ విలువలేదు యేలనొ నరుడా!

# మద్యం



11) సతతము మద్యము తాగుచు
మతి దప్పియు సతిని సుతుల మరచితివనుకో
గతిలేని వాడ వగుదువు
వెతలను కొని తెచ్చుకోకు వినరా నరుడా!

12) తాగుడు వ్యసము వలదుర
తాగిన తేడాను గనవు తల్లికి సతికిన్
తాగుడె మూలము వెతలకు
వేగిరమున మానుకొనుము వినరా నరుదా!

13) గుటగుట మద్యము తాగుచు
అటునిటు వీధులను దిరుగ నప్పులె మిగులున్

అటులైనను విలువుండునె?

కటకట ఇక్కట్లు గలుగు కదరా నరుడా!

14) సోపతి కొరకై తాగుడు

ఆపద కొని తెచ్చి పెట్టు నాస్తులు మింగున్

ఆపకపోయిన యీ స్థితి

ఏ పగిదిన మిగులు నీకు ఇజ్జతు నరుడా!

15) మద్యమె ప్రాణము దీయును

మద్యమె మన సంపదలను మంటను గలుపున్

మద్యమె గౌరవహరణము

మద్యము వర్జించు జనులు మాన్యులు నరుడా!

16) నాడీ తంత్రులు మెదడును
పీడించును మద్యము యది విసమై కడకున్

కీడగు కాలేయమునకు

వీడుట ఈ దురలవాటు విజ్ఞత నరుడా!

17) కూల్చును బ్రతుకును మద్యము

రాల్చును నిధులను ప్రభుతకు రయముగ సుమ్మీ!

కాల్చును ఆరోగ్యములను

పీల్చును జలగల విధమున పేదల నరుడా!

18) తాగుడు వలదన్న సతిని

తూగుతు తులనాడుతావు దూర్తుని వోలెన్

తాగుడు వలననె కోపము

తాగుడుతో వచ్చునన్ని తగవుల్ నరుడా!

19) తాగుడు వ్యసనము ముదిరిన
రోగము దరిచేర్చగలదు రూపము జెరచున్

వేగముగా మాననియెడ

నీగళమే మూగబోవు నిక్కము నరుడా!

20) కోపముతో నీ భార్యయు

నీపిల్లలు నిన్నుజూచి నిందింతురుగా

పాపపు పని తగునేయని

ఓపికతో మానుకొనుట ఉచితము నరుడా!

## సబల



21) త్యాగమయి, సహనశీలిగ
భోగములన్నియు త్యజించి భూదేవి వలెన్
బాగుపడగ సంసారము
సాగించుట పడతుల కిల సాధ్యము నరుడా!

22) వనితయె సృష్టికి మూలము
అనితర సాధ్యంబు సహనమవనిలొజూడన్
వనితలు లేనట్టి గృహము
ననవరతము చీకటిల్లె యనదగు నరుడా!

23) తను పస్తులుండి సైతము

తన పుత్రుల కడుపునింపు  తల్లుల కంటెన్

ఘనమైన దైవమెవ్వరు?

ఎనలేనిది తల్లిప్రేమ ఇలలో నరుడా!

24) గృహిణిగ బాధ్యత నెరుపుచు

అహరహమున సేవజేసి,అమ్మగగెలిచీ

సహనముతో ఉద్యోగము

వహవా! యనురీతిజేయు వనితయె నరుడా!

25) డాక్టరుగా, టీచరుగా,క

లెక్టరుగా స్త్రీలులేక లేదీయిల కం

డక్టరుగా,డ్రైవర్గా

యాక్టరుగా స్త్రీలు గెలిచిరవనిని నరుడా!

26) తల్లిగ, భార్యగ, బిడ్డగ

చెల్లిగ మనతోడు నడచు చెలిమిన్, కలిమిన్

మల్లెల బోలిన మనసుతొ

ఇల్లును దిద్దేరు మహిళలిలలో నరుడా!

27) సైనానెహ్వాల్, ఇందిర

సోనియ, ఐశ్వర్యరాయి, సునితా విలియమ్స్

సానియ మీర్జా, పూర్ణా

మానిని ప్రతిభను తెలిపిరి మహిలో నరుడా!

28) పరసతులను వెంటాడక

తరగని గౌరవమునిచ్చి తల్లిగదలచీ

చరియింప వలెను అపుడే

భరతావని గొప్పతనము వర్ధిలు నరుడా!

29) వరకట్నపు వేధింపులు

చెరబట్టుట పట్టపగలు చేటును దెచ్చెన్

కరుణించని కీచకులతొ

పరువును కోల్పోయె నేడు భారతి నరుడా!

30) పుట్టెడి శిశువును స్త్రీయని

పొట్టలొ హతమార్చుచుండె పుట్టకమునుపే

ఇట్టి పనిని ఆపని యెడ

ఎట్టుల కొనసాగు సృష్టి ఇలలో నరుడా!

# ఓటు



31) ఓటే వజ్రాయుధమౌ

ఓటరుకు విలువ పెరుగును ఓటేయుటచే

ధీటైన నేత ఎన్నిక

ఓటు వలన సాధ్యమగును ఉర్విని నరుడా!

32) ఓటుల నమ్ముట తగదుర

చేటగు జనరాజ్యమునకు చేవయుతగ్గున్

మాటకు నిలబడు నేతకు

ఓటేయుట నీతితోడ ఒప్పగు నరుడా!

33) లంచము ఇచ్చెడి నేతలు

ఇంచుక సంకోచ పడక ఏ నిధులైనన్

వంచన తో దిగమింగుదు

రెంచుకొనుము మంచినేత నెప్పుడు నరుడా!

34) నీతికి పట్టము గట్టుము

జాతికి నీ ఓటు రక్ష జవసత్త్వంబౌ

భీతిల్లక ఓటేయుము

నీతి నడత దప్పబోకు నిజముగ నరుడా!

35) గణతంత్రపు దేశములలొ

ఘనమగు ప్రఖ్యాతి భరత ఖండము బొందెన్

మనమే దీనికి మూలము

అని మరువక ఓటు హక్కు నమ్మకు నరుడా!

36) ఓట్లను బేరము లాడుచు

కోట్లకు పడగెత్తుచున్న కుత్సితమతులే

తూట్లు బొడుతురభివృద్ధికి

నోట్లను ఆశించము యని నుడువుమునరుడా!

37) చీరలు ఎరగా జూపుచు
నారీమణి ఓట్ల కొరకు నానా విధముల్

పైరవి జేతురు కొందరు

ఏ రకముగ లొంగవలదు ఇలలో నరుడా

38) మద్యము ఎరగా జూపుచు

హృద్యమ్ముగ పురుష జనుల యెదలను దోచున్

మద్యానికై బానిసవై

వధ్యశిలకు ఓటు హక్కు వదలకు నరుడా!

39) ఓటే ప్రగతికి మూలము

ఓటే మన బ్రతుకు బాట ఓటేయొరా!

ఓటేయుట మన విధియగు

ఓటే దేశాభివృద్ధి ఊతము నరుడా!

40) ఓటుకు నోటును ఇచ్చెడి
చీటరు నాయకుల నెల్ల చీకొట్టవలెన్
ఓటరులకు ఎరజూపక
మాటను నిలబెట్టు వాడె మాన్యుడు నరుడా!

# చెట్లు



41) వృక్షములను నరకవలదు
రక్షించిన వృక్షము నిను రక్షించునుగా
వృక్షమె ధరణికి రక్షగు
తక్షణమే మొక్క నాటు తప్పక నరుడా!

42) కూడుకు, గూడుకు, గుడ్డకు
తోడై నిలుచును తరువులు, తోయమునొసగన్
మోడని అలుసా? నినుకా
పాడును చెట్లే సతతము వసుధను నరుడా!

43) జనులకు ఆక్సీజనొసగు

దునుమాడును కలుషితమును, ధూళిన్ ఓజో

నును కవచము వోలెన్ ర

క్షణజేయును భూరుహములు-గనరా నరుడా!

44) క్లోరో ఫ్లోరో కార్బను

ఈ రోగములన్నిటికిని హేతువు గదరా!

వారింపగయీగండము

నారంభించాలి హరిత హారము నరుడా!

45) తరువులు ఫలముల నిచ్చును

తరువులు ఫర్నీచరొసగు తనువును చీల్చీ

విరులను నరులకు పంచును

కరువును తరుమును తరువులు కనరా నరుడా!

46) చెట్టును నరికిచో మరి

ఎట్టుల కొనసాగు బ్రతుకు ఈధరణి పయిన్

ఒట్టేయము యీదినమున

చెట్టును కాపాడెడి ధృడ చిత్తమునరుడా!

47) కమ్మని ఫలముల దళముల

ఇమ్ముగ మనసారనరులకిచ్చును మరి పూ

రెమ్మలు, కొమ్మలు, పరులకె

అమ్మతనమె చెట్టు నిండ యనదగు నరుడా!

48) కాడి యగును రైతులకిల

పాడెయగును నరుడు పరమ పదమును జెందన్

వీడక నరజన్మను కా

పాడు తరువు రక్ష జనుల బాధ్యత న రుడా!

49) బతికుండి మేలుసేయును

బతుకును కోల్పోయి గూడ బాధ్యత తోడన్

వెతదీర్చును ధరణి జనుల

నతులర్పణజేతు త్యాగినగముకు నరుడా!

50) మొగులును బిలుచుచు తా వ

ర్షాగమనమునకు తరువులు చారుల వోలెన్

వేగముగా కృషిసలుపును

త్యాగమనగ తరువులదగు తథ్యము నరుడా!

# నీరు



51) చెలిమెల జలములు బాయెను

కలుషితమవ నదులు మరియు కాసారములున్

కళదప్పెను కుంటలు, చెరు

వులు వెలవెల బోయె నేడు ఉర్విని నరుడా!

52) నీరే ప్రాణాధారము

నీరే తరువుకు ధరణికి నేస్తము సుమ్మీ

నీరే లేకున్నను మన

నేరవు జీవులు జగతిని నిక్కము నరుడా!

53) జలకాలుష్యము వలననె

ఇలలో ఇక్కట్టులెన్నొ యిట్టే గలుగున్

జలములు కలుషిత పరుచుట

వలననె రోగములు గలుగు వసుధను నరుడా!

54) నీటిని కాపాడనిచో

కాటేయును కరువు మనల కర్కశరీతిన్

నీటి పొదుపులో ఏమరు

పాటుగ నీవుండ వలదు పదిలము నరుడా!

55) బిందువు బిందువు పొదుపుతొ

సింధువుగా మార్చ గలవు చేతన తోడన్

ఎందుకు యీనిర్లక్ష్యము

ముందు తరము మేలుగోరు ముదమున నరుడా!

56) గరళము మింగిన పరమే

శ్వరుడైనను నల్లగొండ జనులకు సరియే?

హరహర! ఫ్లోరిను నీటిని

నిరతము సేవించలేడు నిజముగ నరుడా!

57) అరకొర జలముల సరఫర

సరిపోవక ధరణియంత సంకట పడగన్

విరివిగ జలములను వృథా

పరచుట అవివేకమగును భద్రము నరుడా!

58) ఉదకము గ్రోలని ప్రాణులు

వెదికిన కనిపించబోవు వివరింపంగన్

మదిమరువక నీటిని బహు

పొదుపుగ వాడుట సరియగు పుడమిని నరుడా!

59) చెరువుల పునరుద్ధరణతొ

సిరులను కురిపించవచ్చు సేద్యము కొఱకై

విరివిగ జల సిరుల నొసగి

తరుమును కరువును చెరువులు తప్పక నరుడా!

60) కళకళలాడెడి పల్లెలొ

వెలవెల బోవును చెరువులు వేసవి యందున్

మలమల మాడును జీవులు

జలములు కరువైన యెడల జగతిని నరుడా!

# మాతృ భాష




61) తెలుగే వెలుగులు జిమ్మును
తెలుగే మన అమ్మభాష తేనెలు గురియున్
తెలుగుకు పద్యము సొంతము
తెలుగును నేర్వంగ వలయు తెలియుమునరుడా!

62) మన భావము మనకోపము
మన ఆలోచనలను మన మనసును దెలుపన్
మన సంస్కృతి మన వేషము
మన భాషయె ప్రతిఫలించు మరువకు నరుడా!

63) భాషతో భావ వినిమ యము

భాషయె పిల్లల చదువుకు బాసటయౌరా!

భాషయె లేనట్టి ధరణి

శ్వాసను విడిచిన మనుజుని చందము నరుడా!

64) మన భాషను కాపాడుట

మన బాధ్యత యంచు తెలుగు మాధ్యమమందే

మన మెప్పుడు భాషించుట

మన భాషకు గౌరవమగు మహిలో నరుడా!

65) తమిళుల రీతిన ఆంధ్రులు

తమ భాషను ఇచ్చగింప తలచరదేలా?

తమ ఆత్మగౌరవమునకు

తమ భాషయె ప్రతినిధియగు తప్పక నరుడా!

66) ఎందరో తెలుగేతరులును

అందము లొలికెడి తెలుగుకు ఆకర్శితులై

గ్రంథరచన గావించిరి

సుందరమని నుడివినారు చూడర నరుడా!

67) తెలుగనిన చులకనేలా?

కలిమిని, బలిమిని, తెలివిని కమ్మనితెలుగే

సులువుగ నందించ గలదు

విలువైనది అమ్మ భాష వినరా నరుడా!

68) పరభాష మీద మోజుతొ

నిరసించుచు అమ్మభాష నేర్వనియెడలన్

మెరుగైన జ్ఞాన నిర్మితి

కరువగు కావున కలుగును కష్టము నరుడా!

69) అభివృద్ధి యైన దేశము

లభిలాషతొ అమ్మభాష అభ్యసనమునన్

అభివృద్ధిని సాధించెను

అభిమానించుము తెలుగును ఆత్మలొనరుడా!

70) అలవోకగ మాట్లాడుట

సులభముగా రాయవచ్చు సుందరమొదవన్

కళలెన్నొ నేర్చుకొనుటయు

తెలుగుతొ మాత్రమె సులభము తెలియుమునరుడా!

# సన్న ప్రాణాలు- సందేశాలు



71)**చీమ:** క్రమ శిక్షణ గల జీవులు

శ్రమజీవనమందు  మనుజ జాతికి ఆద

ర్శముగా నిలుచును చీమలు

సుమనసు తోస్వీకరించు శుభమగు నరుడా!

72)**కాకి:** కాకుల వలె కలిసుండుట

లోకులలో గానరాదు లోపముదేమో!

కాకా యని తన వారిని

యే కానల నున్న బిలుచు యిమ్మిగ నరుడా!

**73)కుక్క:** చేసిన మేలును మరువకు

ధ్యాస మరచి నిదురబోకు ధరణిన్ యావి

శ్వాసముగల శునకము వలె

వాసిగ నువు బ్రతుక వలయు వసుధను నరుడా!

**74)గోవు :** మనుజుల మేలును గోరుచు

తన బిడ్డల పాలనిచ్చు త్యాగీ గోమా

తను జూసి సాధుబుద్ధి సు

గుణముల నలవరచు కొనుము కూర్మినినరుడా!

**75)పిల్లి :** పిల్లులు తమ నోట కరచి

పిల్లల నేడిళ్ళు ద్రిప్పి ప్రేమగ బెంచన్

చల్లని భద్రత కొరకై

తల్లిగ తన బాధ్యత యది తప్పక నరుడా!

**76)కోకిల:** ఆకారము వలన గుణము

నీకే విధముగ తెలియదు నిజముగసుమ్మీ

కోకిల రూపును జూడక

**77)ఉడుత**: పిడికెడు సాయము జేసిన

కడుపుణ్య ఫలము గలుగును కరుణన్ కూర్మిన్

వడివడి సైకత మిచ్చిన

ఉడుతేరా నీకు స్ఫూర్తి ఉర్విని నరుడా!

**78) కొంగ:** ఏకాగ్రత, సహనము తో

ఏ కార్యము లైన సఫల మిచ్చును జగతిన్

ఏకాగ్రత గల ప్రాణులు

నీ కాదర్శము బకములు నిజముగనరుడా!

**79)తేనెటీగ:** పరులకు ఉపకారముకై

విరివిగ తేనెలను గూర్చు వేడుకతోడన్

కరమొప్ప తేనెటీగలు

నరులకు నేర్పించు పొదుపు నడతను నరుడా!

**80) కోడిపుంజు**: లోకమును నిదుర లేపగ

వేకువనే కోడిపుంజు వీడును నిదురన్

లోకుల చైతన్యపరిచి

ప్రాకటముగ మేలు చేయువసుధన్ నరుడా!

# చదువు



81) చదువులు చక్కగ చదివిన

పదముల వద్దకు కొలువులు పరుగునవచ్చున్

చదవని మనుజుడు పరిపరి

విధముల అవమానమొందు పృథివిన్ నరుడా!

82) పంచిన కొలదిగ నరులకు

కుచించుకుపోవు సిరులు కువలయమందున్

పంచిన కొలదిగ చదువులు

పెంచుకొనగ సాధ్యమగును పేర్మిని నరుడా!

83) చదువులు సౌఖ్యము నిచ్చును

చదువులు విజ్ఞానమొసగు చక్కని నడతన్

చదువులె సమకూర్చు ధరణి

చదువులతో కీర్తి బెరుగు చదువుమునరుడా!

84) చోరులకు వశము గానిది

భారము గాదెంతయు సము పార్జన జేయన్

వారెవ్వా! చదువుల కిల

వేరే సిరి సాటిరాదు వినరా నరుడా!

85) అజ్ఞానము తొలగించును

విజ్ఞానము వెల్లివిరియు విజ్ఞత పెరుగున్

సుజ్ఞానిగ నిను దిద్దును

ప్రజ్ఞాన్వితు చేయు విద్య వసుధన్ నరుడా!

86) వినయము తో గూడి చదువు

ఘనమగు ఫలితముల నిచ్చు గౌరవమిచ్చున్

అనయము క్రమశిక్షణతో

కనకమునకు తావియట్లు కదరా నరుడా!

87) అవధానము తో జదివిన
అవలీలగ నేర్వగలవు అన్ని విషయముల్

చవి చూసిన చదువుల రుచి

ఎవరేనియు ఆపగలరె యిలలో నరుడా!

88) కులమత భేదము లేవియు

కలిగించవు విఘ్నములను గావున చదువుల్

తెలివిగ నేర్వంగ వలయు

వెలివేయుము న్యూనతలను వేగమెనరుడా!

89) చదువుము సద్గ్రంథములను

చదువుము సకలార్థశాస్త్ర సాహిత్యములన్

చదువుము జీవిత సారము

చదువుము యీలోక రీతి చదువుము నరుడా!

90) చదివినచో అనునిత్యము

ఎదగ గలవు శిఖర సమము ఏవిధి యైనన్

మది మరువకు విద్యనెపుడు

అదియే కాపాడు నిన్ను అవనిన్ నరుడా!

# తెలంగాణ



91) అరువది యేండ్లకు పైగా
చెరబడె తెలంగాణ తల్లి ఛిద్రంబయ్యేన్
చెరవిడిపించుట కొరకై
తిరగబడిరి సకల జనులు ధీటుగ నరుడా!

92) కాకతి  రుద్రమ్మ పటిమ
చాకలి ఐలమ్మ ధైర్య సాహస స్ఫూర్తిన్
ఏకత్వమ్ముగ నడిచిరి
సాకారముజేసెలక్ష్యసాదన నరుడా!

93) వీరులు తమ ప్రాణములను
ధారగ బోసిరి మిగిలిరి త్యాగధనులుగా
వారిని మనమున దలుచుచు
కోరుము తెలంగాణ ప్రగతి కూర్మిని నరుడా!

94) కొమరయ్య త్యాగనిరతియు
కొమరము భీముని సమరము  గోండుల శౌర్యం
బమరిన తెలగాణములో
అమరులె యీనెల తల్లి యాప్తులు నరుడా!

95) కాసోజు వంశ తిలకుడు
వేసెనుముందడుగు ప్రాణ భీతియెలేకన్
శ్వాసను విడిచెను యీ ప్రజ
కోసము శ్రీకాంతు స్వేచ్ఛ కోరుచు నరుడా!

96) యాదగిరి నారసింహుని
పాదాబ్జముల తెలగాణ పావనమయ్యేన్
యాదగిరీవుడి  జగతిన
బాధలు బాపంగ నీకు వరకుడు నరుడా!

97) చెరసాలలు ఉరికొయ్యలు
ఉరకలిడెడి ఉద్యమమున కూపిరి కాగా
వెరవక పోరిన ఫలమిది
వరమగు తెలగాణ ఖ్యాతి మరువకు నరుడా!

98) తంగెడు పూవోలె మెరయు
బంగరు తెలగాణ కొరకు బాటలువేయన్
లొంగకు అవినీతికి దిగ
మింగకురా ప్రజల సొమ్ము మేలగు నరుడా!

99) తెలగాణ ధరణి జూడగ
విలువగు సిరులున్నయట్టి వైకుంఠంబున్
తలపించును మరియేలనొ
కళదప్పెను పేదరికము గలుగగ నరుడా!

100) **'కందమకరందమ'**ను ఈ
సుందరమగునట్టి పద్య సుధలను ఛాత్రుల్
విందుగ తెలగాణ భువి మి
ళిందములై గ్రోలవలయు లెస్సగ నరుడా!

# పద్యము

101) పద్యము విబుధుల సేద్యము
పద్యము తో పరిఢ విల్లు ప్రజ్ఞాయశముల్
పద్యము రస పూర్ణులకును
హృద్యమ్మౌ మ నసుదోచు ఇలలోనరుడా!

102) పద్యము కైవల్య పథము
పద్యమె మానమును బెంచు పండితులకిలన్
పద్యమె ధారణ బెంచును
పద్యమె  పఠియింపనెపుడు వదలకు నరుడా!

103) పద్యము చదువుట వలననె
విద్యార్థికి ధారణ మరి విలువలు బెరుగున్
పద్యము సిద్దీప్తినొసగు
పద్యములే తీర్చిదిద్దు వసుధను నరుడా!

104) మనసుకు సంతృప్తి నొసగు
వినసొంపయి రస హృదయుల విజ్ఞులకెల్లన్
మనసును రంజింపగలుగు
ఘనముగ పద్యము సతతము గదరా నరుడా!

105) పద్యమె భాషకు బాసట
పద్యమె విజ్ఞాన మెసగు భావలహరులన్
పద్యమె మొల కెత్తించును
విద్యార్థుల మది పొలమున వినరా నరుడా!

106) ఎందరొ సుకవుల వలననె
సుందరమగు పద్య విద్య శోభిల్లెనుగా
డెందము నుప్పొంగు నటుల
అందరికీని వందనములు అవనిన్ నరుడా!

107) మదిలో మెదిలిన భావము
హృదిల నుప్పొంగు రసము నేకబిగిన నే
పదిల పరచుటకు పద్యము
మది దలచుచు రాసినాను మహిలో నరుడా!

108) శ్రీ చెరువుగట్టు లింగని
యాచించితి పద్యధార నందించుటకై
బ్రోచుమని వేడుకొంటిని
గా చెను నన తీఙ్నల కరుణ తొ నకరా నరుడా!

ooo---------------సమాప్తం--------------



KANDAMAKARANDAM

POEMS BY SAGARLA SATHAIAH

## కవి పరిచయం:


పేరు: సాగర్ల సత్తయ్య

తల్లిదండ్రులు:ధర్మయ్య-పార్వతమ్మ

విద్యార్హతలు: ఎం.ఎ,బియిడి.నెట్

వృత్తి:స్కూల్ అసిస్టెంట్ (తెలుగు)

జి.ప.ఉ.పా చిన్నకాపర్తి

అభిరుచులు:సాహిత్య పఠనం,రచన వ్యాసాగం

చిరునామా: వట్టిమర్తి,చిట్యాల,నల్లగొండ జిల్లా


కందము ఛందమందు శతకంబును వ్రాసి మహాకవీంద్ర స
ద్బృందములోన జేరితివి ప్రేమపురాశివి తమ్ముడా! పఠిం
పందగు శైలి, భావనలు భవ్యము, భాష సుబోధకంబు,హృ
న్విందగు యోచనా సరళి నిన్ను నొనర్చెను ధన్యమూర్తిగా!

-దోరవేటి